ఈ-పేపర్ తెలుగు డైలీ

ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.com/



## రేవంత్ రెడ్డి ఇంటి వద్ద భద్రత పెంపు.. భారీగా మోహరించిన పోలీసులు




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** హైదరాబాద్ లో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి నివాసం వద్ద పోలీసులు భద్రతను పెంచారు. డిసెంబర్ 5వ తేదీ జూబ్లీహిల్స్ లోని రేవంత్ ఇంటి ముందు పోలీసులు బారి కేడ్స్ ఏర్పాటు చేశారు. లా ఎండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు భారీగా మోహరించారు. రేవంత్ రెడ్డి నివాసం వైపు పోలీసులు ఎవ్వరినీ అనుమతించడం లేదు. మరోవైపు రేవంత్ రెడ్డి.. గత మూడు రోజులుగా నగరంలోని ఎల్లా హెూటల్ లో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలతోనే ఉన్నారు.కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన విషయం తెలిసిందే. అయితే, సీఎం ఎవరనే దానిపై పార్టీలో సస్పెన్స్ కొనసాగుతోంది. మెజార్టీ ఎమ్మెల్యేలు.. సీఎంగా రేవంత్ ండ్డిని కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. రేవంత్ పాటు భట్టీ విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కూడా సీఎం రేసులో ఉండడంతో సీఎం ఎంపిక ఆలస్యమవుతోంది. అయితే, కాంగ్రెస్ అధిష్టానం సస్పెన్స్ కు తెరదించుతూ.. ఈరోజు సీఎం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది.


బుధవారం 06, డిసెంబర్ 2023



### తెలంగాణకు కాబోయే మంత్రులు వీరేనట!




### మిగ్జామ్ తుపాను ఎఫెక్ట్... కలెక్టర్లను అప్రమత్తం చేసిన సీఎస్ శాంతికుమారి



### ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులోని అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్న కేసీఆర్



## ఎమ్మెల్యే కాలేరుకు కొనసాగుతున్న శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే కాలేరుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నియోజకవర్గం జర్నలిస్టులు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, డిసెంబర్ 05:** భారీ మెజార్టతో రెండో సారి అంబర్ పేట గడ్డపై గులాబీ జెండా ఎగుర వేసిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కు మూడో రోజూ శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. మంగళవారం అంబర్ పేట నియోజవవర్గానికి చెందిన వివిధ ప్రధాన పత్రికలకు చెందిన జర్నలిస్టులు ఎమ్మెల్యే కార్టర్స్ లో కాలేరు వెంకటేశ్ ను కలసి శాలువాతో సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలేరు మాట్లాడుతూ.. తన విజయానికి తొడ్పడిన జర్నలిస్టులకు ధన్యావాదాలు తెలిపి భవిష్యత్తులో మీ సహకారం ఇలాగే కొనసాగాలని కోరారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో పుండరి చారి, అబ్బయ్యగౌడ్, లక్ష్మణ్, మహేందర్, రమణ్ రాజు రత్న, రమేశ్, పురుశోత్తం, ప్రవీణ్, శ్రీను, అమరేందర్, సతీష్, హన్సరాజ్ తదితరులు ఉన్నారు.

## 'సేవా యూత్' సేవా కార్యక్రమం



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, డిసెంబర్ 05:** అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ సేవా స్థంస్థ సేవా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం గోల్నాక లో సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలొ నిర్వహించిన సేవా కార్యక్రమానికి మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కాచిగూడ ఏసీపీ కె.శ్రీనివాస్ తదితరులు హాజరై ...పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు అందజేసి వారి ని ఘనంగా సన్మానించారు. దీంతో పాటు రచ్చ శ్రీనివాస్ పుట్టిన రోజు కూడా కావడంతో అక్కడికి వచ్చిన అతిథులు, జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

# రేవంత్ అనే నేను...

### ఉత్కంఠ వీడింది, ఊహించిందే జరిగింది - రేవంత్ రెడ్డికే సీఎం పగ్గాలు




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, డిసెంబర్ 05:** శాసనసభ ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యం సాధించిన కాంగ్రెస్ పార్టీ రెండ్రోజుల కసరత్తుల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిని ఎంపిక చేసింది. ఈ నెల 3న ఫలితాలు వెలువడిన వెంటనే అప్రమత్తమైన అధిష్ఠానం, గెలిచిన 64 మంది పార్టీ ఎమ్మెల్యేలను హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఎల్లా హెూటల్‌కు తరలించింది. మరుసటి రోజు జరిగిన సీఎల్పీ సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించారు. ముఖ్యమంత్రి, మంత్రివర్గం ఎంపికపై సుదీర్ఘంగా చర్చించగా, ముఖ్యమంత్రి, మంత్రివర్గంపై చర్చలు కొలిక్కి రాలేదు. ఈ పరిస్థితుల్లో సీఎల్పీ ఎంపిక బాధ్యతను అధిష్ఠానానికే వదిలి పెట్టాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయానికి కట్టుబడాలని చేసిన ఏక వాక్య తీర్మానానికి ఎమ్మెల్యేలు ఆమోదించారు.

**ముఖ్యమంత్రిగా రేవంత్‌వైపే రాహుల్ మొగ్గు**

రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ, ఎమ్మెల్యేల తీర్మానంతో ఢిల్లీ వెళ్లిన ఏఐసీసీ పరిశీలకులు డీకే శివకుమార్, మాణిక్‌రావ్ ఠాక్రే ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో సమావేశమై ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక, ఇతర అంశాలపై చర్చించారు. ఈ కీలక భేటీలో రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. తెలంగాణ పరిణామాలు, సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు చెప్పిన అభిప్రాయాలపై ఈ భేటీలో చర్చించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రిగా రేవంత్ పేరునే రాహుల్ గాంధీ సూచించగా, ఈ భేటీ అనంతరం తమ అభిప్రాయాలు చెప్పుకునేందుకు దిల్లీ వచ్చిన ఉత్తమ్, భట్టిలతో కేసీ వేణుగోపాల్ సమావేశమయ్యారు.దాదాపు 40 నిమిషాల పాటు చర్చించారు. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డి పేరును ప్రకటించారు. ఈనెల ఏడో తేదీన ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. కొత్త సీఎల్పీ నేత ఎంపికపై సోమవారం భేటీ జరిగింది. కాంగ్రెస్‌కు విజయం అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశాం. సీఎల్పీ భేటీపై డీకే శివకుమార్, మాణిక్‌రావు ఠాక్రే నివేదిక ఇచ్చారు. నివేదికపై కాంగ్రెస్ సీనియర్ నేతలతో చర్చలు జరిగాయి. కొత్త సీఎల్పీ నేతగా రేవంత్ రెడ్డిని ఎన్నుకోవాలని నిర్ణయించాం. తెలంగాణ ప్రజల ఆకాంక్షలునెరవేర్చడమే కొత్త ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు అమలు చేస్తాం. తెలంగాణ ప్రజలకు సుపరిపాలన అందించడమే మా ధ్యేయం. వన్‌మెన్‌షోగా ఉండదు. కలిసికట్టుగా ముందుకు సాగుతామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

# తెలంగాణ సీఎంగా మాస్ లీడర్..

### రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం ఎలా జరిగిందంటే ..?



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** తెలంగాణ రాజకీయాల్లోనే.. కాదు దేశవ్యాప్తంగా వినిపిస్తున్న.. పేరు రేవంత్ రెడ్డి.. గూబగుయ్యిమనేలా సమాధానం చెప్పడం ఆయన స్టైల్ ఆఫ్ రాజకీయం. తొలి అడుగు నుంచి టీపీసీసీ చీఫ్‌గా పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే స్థాయి వరకు రేవంత్ నడిచిన దారి రహదారి కాదు.. ముళ్లదారి. ప్రతి అడుగులో అడ్డంకులు.. ప్రతి చర్యలో విమర్శలు.. ప్రతి నిర్ణయంలో వివాదాలు.. ఇలా ఆయన ముఖ్యమంత్రి సీటు వరకు వెళ్లారు.. సింహాసనాన్ని అధిరోహించనున్నారు. రేవంత్ రెడ్డి డిసెంబర్ 7న తెలంగాణ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ సీఎల్పీ నేతగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి రాజకీయ జీవితం.. ఎలా సాగిందో ఒకసారి చూడండి..

రేవంత్ రెడ్డిది సిల్వర్ స్పూన్ రాజకీయం కాదు. కార్యకర్త స్థాయి నుంచి రాజకీయాలు చేస్తూ.. అందులో అనుభవం సంపాదిస్తూ.. తనకంటూ ఓప్రత్యేక పాపులారిటీని సంపాదించుకుని మాస్‌లీడర్‌గా ఎదిగి తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త ట్రెండ్‌ను సృష్టించారన్నది విశ్లేషకుల అభిప్రాయం. జడ్పీటీసీగా మొదలైన రాజకీయ ప్రయాణం%ా%వైఎస్ఆర్ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా గెలుపొందడంతో రేవంత్‌రెడ్డి అన్నపేరు రాజకీయానికి పరిచయమైంది. వైఎస్ఆర్ లాంటి ఆకాశమంత డైనమిక్ లీడర్‌ను ఢీకొని.. ఇండిపెండెంట్‌గా నిలబడి గెలవడంతో 2007లో రేవంత్ పేరు మార్మోగింది.

ఇండిపెండెంట్‌గా మొదలైన రేవంత్ పొలిటికల్ అడుగులు..టీడీపీలో అడుగుపెట్టాక ఆయన రాజకీయం పరుగు అందుకుంది. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ సీనియర్ సభ్యుడు రావులపల్లి గుర్నాథరెడ్డిపై విజయం సాధించారు. అక్కడ్నుంచి కొండగల్ కోడెగిత్త.. అనిపిలుపించుకునే స్థాయికి రేవంత్ ఇమేజ్ పెరగసాగింది. ఇలా టీడీపీలో మెట్టు మెట్టూ ఎదుగుతూ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా..నమ్మినబంటుగా మారి..పార్టీ తరపున గట్టిగా వాయిస్ వినిపించేవారు. 2014నుంచి రేవంత్ రాజకీయం మరో టర్న్ తీసుకుంది. రాష్ట్రవిభజన తర్వాత ఎమ్మెల్యేగా గెలిచినా.. తెలంగాణలో టీడీపీ గ్రాఫ్ పడిపోసాగింది. అలాగే ఒక్కో మరక రేవంత్ రాజకీయ జీవితంపై పడసాగింది. 2009-2014 అసెంబ్లీ ఎన్నికలలో ఈసీకి సమర్పించిన అఫిడవిట్ల కారణంగా రేవంత్ రెడ్డి తొలిసారి అవినీతి మరక పడింది. 2009 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయంలో ఆయన తన ఆస్తులు రూ. 3.6 కోట్లు గానూ, రూ. 73 లక్షలు వరకు అప్పులు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపారు. ఐదేళ్ల తర్వాత అంటే 2014 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన తన ఆస్తుల విలువ రూ. 13.12 కోట్లు గానూ, అప్పులు రూ. 3.3 కోట్ల వరకు ఉన్నట్లు చూపారు. అంటే కేవలం అయిదేళ్లలోనే ఆయన ఆస్తులు 4 రెట్ల వరకు పెరిగాయన్న మాట. దానిపై విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్న సందర్భంలోనే ఓటుకు నోటు అంశం రేవంత్ పొలిటికల్ కెరీర్‌లో మాయని మచ్చగా మిగిలింది. 2015తెలంగాణ శాసన మండలి ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలంటూ.. నామినేటెడ్ ఎంఎల్ఏ ఎల్విస్ స్టీఫెన్సన్‌కు రేవంత్‌రెడ్డి లంచం ఇవ్వజూపారంటూ ఓ స్టింగ్-ఆపరేషన్ వీడియో బయటికొచ్చింది. దీనిపై పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో ఏసీబీ 2015 మేలో రేవంత్‌రెడ్డిని అరెస్ట్ చేసింది. దాదాపు నెలరోజుల పాటు జైల్లో ఉండాల్సివచ్చింది. తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో రేవంత్‌రెడ్డి 2015 జూలై ఒకటో తేదీన విడుదలయ్యారు. ఇది కూడా రేవంత్‌రెడ్డి పాపులారిటీని పెంచేలా చేసిందంటారు రాజకీయ విశ్లేషకులు. కేసీఆర్‌ను గద్దె దింపడమే తన లక్ష్యం అంటూ చర్లపల్లి జైలునుంచి బయటకు వచ్చిన క్షణంలో రేవంత్ చేసిన సవాల్ ఇది. ఆలక్ష్యం కోసమే రేవంత్‌రెడ్డి ఇష్టంలేకపోయినా కొందర్ని కలుపుకున్నారని.. కొందరితో గొడవపడ్డారని%ా%సొంతపార్టీలో ఎన్ని అవమానాలు ఎదురైనా ఓర్చుకున్నారని%ా%అమ్ముడుపోయిన రేవంత్‌రెడ్డి అంటూ ప్రత్యర్థులు తిట్టిపోసినా పంటిబిగువున భరించాడని..ఆయన అభిమానులు తరచూ చెప్పేమాట

ఓటుకు నోటు కేసు తర్వాత రేవంత్ రెడ్డి రాజకీయం కొండెక్కిందని..ఇక కొండగల్‌కే పరిమితమని హేళన చేసినోళ్ల నోళ్లకు తాళం వేసేలా రేవంత్‌రెడ్డి ఎదిగిన తీరు ప్రశంసనీయమంటారు రాజకీయ విశ్లేషకులు. ఓటుకు నోటు కేసు తర్వాత బెయిల్‌నుంచి విడుదలయ్యాక టీడీపీలో మునుపటి జోరు తగ్గింది. కీలక నేతలంతా ఒక్కొక్కరుగా అధికారపార్టీలోకి జారుకోవడంతో పార్టీ మరింత బలహీనపడింది. దీంతో టీడీపీలో ఉంటే తన టార్గెట్ రీచ్ కాలేమని భావించిన రేవంత్‌రెడ్డి 2017 అక్టోబరులో టిడిపికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే చంద్రబాబు సలహాతోనే కాంగ్రెస్‌లో చేరారన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో అయితే చేరారు కానీ..అక్కడి గ్రూపు రాజకీయాలు తట్టుకుని నిలబడం అంతతేలికైన వ్యవహారం కాదని త్వరగానే తెలుసుకున్నారు. సొంతపార్టీ నేతలు చీత్కారాలమధ్యే తనపని తాను చేసుకుంటూ వెళ్లారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా రేవంత్‌పై నమ్మకంతో 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రమోషన్ ఇచ్చింది. అయితే 2018 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అక్కడ రేవంత్ దూకుడుకు




## ప్రత్యేక విమానంలో ఢిల్లీకి రేవంత్ రెడ్డి

ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05: తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డిని ఫైనల్ చేసిన కాంగ్రెస్ పార్టీ హైకమాండ్.. ఢిల్లీకి రావాలని ఆదేశించింది. దీంతో మూడు రోజులుగా హెూటల్ లో ఉన్న రేవంత్ రెడ్డి.. అక్కడి నుంచే నేరుగా బేగంపేట ఎయిర్ పోర్టుకు వెళ్లారు. ప్రత్యేక విమానంలో.. ఢిల్లీకి వెళ్లారు . రేవంత్ రెడ్డి ఒక్కరే ఢిల్లీకి వెళ్లటం.. అది కూడా సీఎంగా ఖరారు అయిన తర్వాత.. పిలుపు రావటం ఆసక్తిగా మారింది.రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళుతున్న సమయంలో.. హైదరాబాద్ లో ఏఐసీసీ పరిశీలకులు కేసీ వేణుగోపాల్ మీడియా సమావేశం ఏర్పాటు చేయటం.. ఈ పరిణామంలో ట్విస్ట్. మరో ఆసక్తికర అంశాన్ని తీసుకుంటే.. ఇప్పటికే ఢిల్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబుతోపాటు మరికొందరు సీనియర్లు అక్కడే ఉన్నారు. వాళ్లు ఢిల్లీలోనే ఉన్న సమయంలోనే.. రేవంత్ రెడ్డిని ఢిల్లీకి రావాలని ఆదేశించటం ఆసక్తిగా మారింది. మంత్రి వర్గం కూర్పుపైనే చర్చలు అనే ప్రచారం జరుగుతుంది. డిప్యూటీ సీఎం ఎవరు.. వాళ్లకు ఏ శాఖ కేటాయించాలి.. మంత్రి వర్గంలోకి తీసుకుంటున్న వారికి.. ఎలాంటి శాఖలు ఇవ్వాలి అనే అంశాలపై రేవంత్ రెడ్డి సమక్షంలోనే.. కాంగ్రెస్ హైకమాండ్ చర్చించనున్నట్లు.. జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

## తుపాను నేపథ్యంలో.. అధికారులకు రేవంత్ రెడ్డి సూచనలు

### ముఖ్యమంత్రిగా ప్రకటించడానికి కొన్ని నిమిషాల ముందు రేవంత్ ట్వీట్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** టీపీసీసీ అధ్యక్షుడు, కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. తనను సీఎల్పీ నేతగా ప్రకటించడానికి కొన్ని నిమిషాల ముందు ఆయన ఎక్స్ వేదికగా తుపాను ప్రభావ అంశంపై ట్వీట్ చేశారు. తెలంగాణలో పలు జిల్లాలలో తుపాను ప్రభావంపై ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరి ధాన్యం తడిసిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ, లోతట్టు ప్రాంతాల్లో జన జీవనానికి ఇబ్బంది కలుగకుండా చూడాలని తెలిపారు. అవసరమైన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

## లోక్‌సభలో తెలంగాణ సమ్మక్క సారక్క గిరిజన వర్సిటీ బిల్లు




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, డిసెంబర్ 05:** తెలంగాణలో కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోమవారం రోజున లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సెంట్రల్ యూనివర్శిటీల (సవరణ) బిల్లు, 2023 ప్రకటన లక్ష్యాల ప్రకారం సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ స్థాపన రాబోయే సంవత్సరాల్లో ప్రాంతీయ ఆకాంక్షలను తీర్చేలా రూపుదిద్దుకోనున్నట్లు తెలిపారు.

## మిగ్జామ్ తుపాను ఎఫెక్ట్... కలెక్టర్లను అప్రమత్తం చేసిన సీఎస్ శాంతికుమారి



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** మిగ్జామ్ తుపాను ప్రభావంతో రాగల రెండురోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ మేరకు రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. మిగ్జామ్ తుపాను కారణంగా తెలంగాణ జిల్లాల్లో ఎడతెరిపిలేని వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎస్ శాంతికుమారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్లను, అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలు పడే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూర్తిగా నిండిన చెరువులకు గండ్లు పడకుండా చూడాలన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచించారు. భద్రాద్రి, ములుగు జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపిస్తున్నట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రి ఎంపికకు ముందు మల్లు భట్టి విక్రమార్క కీలక ట్వీట్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వరుస భేటీలు జరుపుతున్న కీలక సమయంలో మధిర నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన మల్లు భట్టి విక్రమార్క కీలక ట్వీట్ చేశారు. సీఎం పదవికి రేవంత్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా మల్లు భట్టి ట్వీట్ ఆసక్తికరంగా మారింది. 'ప్రతి పేదవాడి గుండె తాకిన క్షణాలు... గుండె నిండా ఆత్మ స్థైర్యం, కుంగిపోతున్న జీవితాలకు ఈ అరాచక పాలన నుండి విముక్తి ఇవ్వాలన్న లక్ష్యం, నైరాశ్యంలో ఉన్న క్షేత్రస్థాయి కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాలన్న ఆశ.. ఇవే నా పాదయాత్రకు ఆయువు పోసి నడిపించాయి. దట్టమైన గుట్టలు, పొగలు కక్కే రోడ్డులు, వేల అడ్డంకులు.. మండుటెండలు, వడగాళ్ల వానలు, ఎముకలు వణికించే చలి.. కాలేదు ఏవి మన సంకల్పానికి అడ్డు..' అంటూ ట్వీట్ చేశారు. అంతేకాదు.. తాను 1364 కిలో మీటర్లు, 109 రోజులు పాదయాత్ర చేశానని గుర్తు చేశారు. తాను అడుగుపెట్టిన అన్ని నియోజకవర్గాల్లో దాదాపు కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించిందని పేర్కొన్నారు.

# తెలంగాణ సీఎంగా మాస్ లీడర్..

మొదటిపేజీ తరువాయి

కాస్త బ్రేకు పడినట్లైంది. పార్టీలోనూ ఆయనపై మరింత అసంతృప్త జ్వాల రగలడానికి కారణమైంది. అయినా వెనక్కి తగ్గలేదు. ఏం జరిగినా..ఎలా జరిగినా తన మంచికే అనుకుంటూ ముందుకువెళ్లారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. ఈ గెలుపు హైకమాండ్‌కు రేవంత్‌రెడ్డిని మరింత దగ్గర చేసింది. అక్కడ నుంచి రేవంత్‌రెడ్డి దూకుడు కాంగ్రెస్ పార్టీలో మరో లెవల్‌కు వెళ్లింది. ఎదిగేలా చేసింది. చివరకు సీఎం అయ్యేలా చేసింది.

# తెలంగాణకు కాబోయే మంత్రులు వీరేనట!




ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05: మంత్రివర్గంలో ఎవరెవరికి అవకాశం కల్పించాలన్న దానిపై ఇప్పటికే ఒక జాబితాను కాంగ్రెస్ సిద్ధం చేసినట్లుగా చెబుతున్నారు. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ నెల 7తేదీ ఉదయం పది గంటల సమయంలో ముఖ్యమంత్రి గా రేవంత్ రెడ్డితో పాటు... పలువురు మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేస్తారని చెబుతున్నారు. విశ్వసనీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. మంత్రివర్గం జాబితాను సిద్ధం చేశారని.. అందులో అన్ని వర్గాలకు చెందిన వారు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లుగా చెబుతున్నారు. సామాజిక సమతూకం మిస్ కాకుండా ఉండేలా ప్లాన్ చేశారని చెబుతున్నారు. ఇంతకూ మంత్రుల జాబితాలో ఉన్న వారెవరు? వారి సామాజిక వర్గం ఏమిటన్నది చూస్తే.. డిప్యూటీ సీఎం.. భట్టి విక్రమార్క (ఎస్సీ) స్పీకర్.. పొన్నం ప్రభాకర్ (బీసీ) మంత్రులు.. తుమ్మల నాగేశ్వరరావు (కమ్మ) పొంగులేటి శ్రీనివాసరెడ్డి (రెడ్డి) కోమటిరెడ్డి వెంకటరెడ్డి (రెడ్డి) ఉత్తమ్ కుమార్ రెడ్డి (రెడ్డి) సీతక్క (ఎస్టీ) శ్రీధర్ బాబు (బ్రాహ్మణ) జూపల్లి క్రిష్ణారావు /ప్రేమ్ సాగర్ రావు (వెలమ) గడ్డం వినోద్ (ఎస్సీ) జీవన్ రెడ్డి (రెడ్డి) కొండా సురేశ (బీసీ) షబ్బీర్ అలీ/ ఫిరోజ్ ఖాన్ (మైనార్టీ) తదితరులు ఉన్నట్లు తెలుస్తోంది.

## ఢిల్లీలోని తుగ్లక్ రోడ్డులోని అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్న కేసీఆర్



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ లో ఉన్న అధికార నివాసాన్ని ఖాళీ చేయనున్నారు. 2004లో టీఆర్ఎస్ తరపున కరీంనగర్ నుంచి ఎంపీగా గెలుపొందిన కేసీఆర్... మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కేంద్ర మంత్రి హోదాలో ఆయనకు తుగ్లక్ రోడ్ లో టైప్ 8 క్వార్టర్ ను కేటాయించారు. 2006లో కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత నిర్వహించిన ఉపఎన్నికలో మళ్లీ ఎంపీగా గెలుపొంది అదే నివాసంలో కొనసాగారు. 2009లో మహబూబ్ నగర్ నుంచి ఎంపీగా ఎన్నికై అదే నివాసంలోనే ఉన్నారు. 2014లో సీఎం అయిన తర్వాత అదే క్వార్టలోనే కొనసాగారు. రాష్ట్ర ముఖ్యమంత్రులకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో అధికారిక నివాసాలను కేటాయిస్తుంది. ఈ క్రమంలో సీఎంగా ఉన్న కేసీఆర్ కు కేంద్రం అదే నివాసాన్ని కేటాయించింది. ఆ తర్వాత ఎంపీగా గెలుపొందిన కేసీఆర్ కుమార్తె కవిత కూడా ఆ నివాసంలోనే ఉన్నారు. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడంతో సీఎం పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని అధికార నివాసాన్ని కేసీఆర్ ఖాళీ చేయబోతున్నారు.

## తెలంగాణలో ఎన్నికైన 80 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు..



**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** తెలంగాణలో కొత్తగా ఎన్నికైన 80 మంది ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 16 మందిపై తెలంగాణ ఉద్యమం, మోడల్ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అనే ఎన్జీవో సంస్థ ఈ వివరాలను వెల్లడించింది. కొత్తగా ఎన్నికైన 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 50 మందిపై కేసులు ఉన్నట్లు తెలిపారు. కేసులు ఉన్న నాయకుల్లో 78 శాతం మంది అధికార పార్టీ (కాంగ్రెస్) ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 39 మంది ఎమ్మెల్యేలలో 19 మంది (48 శాతం)పై కేసులు ఉన్నాయని ఎన్జీవో తెలిపింది. బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఏడుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ రకంగా బీజేపీలో అత్యధికంగా 87 శాతం ఎమ్మెల్యేలపై కేసులు ఉన్నాయి. ఎంఐఎంకు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేల్లో నలుగురిపై (57 శాతం) కేసులు కూడా ఉన్నాయి. రాజకీయ పార్టీలు నేర చరిత్ర ఉన్న వ్యక్తులకు టిక్కెట్లు ఇవ్వరాదని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ, పార్టీలు గెలుపే ప్రమాణంగా తీసుకుంటున్నాయని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభ రెడ్డి అన్నారు. గత నెలలో, ఎన్జీవో అభ్యర్థుల నేర చరిత్రను విశ్లేషించింది, నాలుగు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన 226 మంది నామినీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని గుర్తించింది. అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లను ఒక కమిటీ విశ్లేషించి నివేదికను సిద్ధం చేసింది. కాంగ్రెస్‌లోని 118 మంది అభ్యర్థుల్లో 84 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. అత్యధిక క్రిమినల్ కేసులున్న తెలంగాణ నేతల్లో.. టీపీసీసీ చీఫ్.. రేవంత్ రెడ్డి 89 కేసులు ఉన్నాయి. తర్వాత ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన వెడ్మ బొజ్జుపై 52 కేసులు, మంచిర్యాలకు చెందిన కొక్కిరాల ప్రేంసాగర్ రావుపై 32 కేసులు ఉన్నాయి. వీరంతా తాజాగా విజయం సాధించారు. ఇక గోషామహల్ నుంచి రెండోసారి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే టి.రాజా సింగ్‌పై 89 కేసులున్నాయి. ఇక కరీంనగర్ నుంచి రెండోసారి ఎన్నికైన బీఆర్ఎస్ నేత గంగుల కమలాకర్‌పై 10 కేసులు ఉన్నాయి. గజ్వేల్ నుంచి మళ్లీ ఎన్నికైన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుపై తొమ్మిది కేసులున్నాయి. అలాగే.. సిరిసిల్ల నుంచి రెండోసారి ఎన్నికైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుపై ఎనిమిది కేసులున్నాయి. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై ఆరు కేసులు ఉండగా, మరో ముగ్గురిపై ఒక్కో కేసు ఉంది.

## నేడు పాగాల సంపత్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించాలి..

### గులాబీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు




**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, డిసెంబర్ 05:** నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జడ్పీ ఛైర్మన్లు, జిల్లా అధ్యక్షులు దివంగత జనగామ జడ్పీఛైర్మన్ పాగాల సంపత్‌రెడ్డికి పార్టీ కార్యాలయాల్లో ఘనంగా నివాళులు అర్పించాలి అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. జనగామ జడ్పీఛైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి పార్థివదేహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులు అర్పించారు. సంపత్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన పాగాల సంపత్‌రెడ్డి హఠాన్మరణం బాధాకరం అన్నారు. 14 ఏళ్లు కేసీఆర్ వెంట సైనికుడిలా ఉండి పని చేశారని, సంపత్‌రెడ్డి మరణం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తను కలచి వేసిందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా సంపత్‌రెడ్డి క్రియాశీలకంగా పని చేశారని, పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా నిబద్ధతతో పనిచేస్తూ విజయవంతం చేశారన్నారు. సంపత్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్, పార్టీ శ్రేణుల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంపత్‌రెడ్డి మరణం పార్టీకి తీరని లోటన్న కేటీఆర్, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. రేపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల జెడ్పీఛైర్మన్లు, జిల్లా అధ్యక్షులు పార్టీ కార్యాలయాల్లో ఘనంగా నివాళులు అర్పించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## మంత్రి పదవి కోసం 'గడ్డం బ్రదర్స్' మధ్య తీవ్ర పోటీ.. సోనియాను కలిసిన వినోద్..



**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ, డిసెంబర్ 05:** సీఎం ఎంపికపై కసరత్తు కొలిక్కి రాకముందే మంత్రి పదవులు ఆశిస్తున్న వారు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఢిల్లీ వేదికగా మాజీ మంత్రి గడ్డం వినోద్ పావులు కదుపుతున్నారు. కొత్త కేబినెట్‌లో తనకు చోటు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని కలిశారు. తాను గతంలో మంత్రిగా ఉన్నానని, ఈ దఫా కూడా తనకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ హైకమాండ్‌కు వినోద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీని వినోద్ కలిశారు. సోనియా సానుకూలంగా స్పందించారని.. తనకు కేబినెట్‌లో చోటు లభిస్తుందని వినోద్ ఆశాభావం వ్యక్తం చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి గడ్డం వినోద్, బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్యపై గెలుపొందారు. చెన్నూరు నుంచి పోటీచేసిన గడ్డం వివేక్ .. బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ పై గెలిచిన విషయం తెలిసిందే. ఇదిలాఉంటే.. మంత్రి పదవి హామీతోనే వివేక్ పార్టీలో చేరారని.. ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఇద్దరిలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి లభిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మంత్రి పదవి విషయంలో గడ్డం బ్రదర్స్ వ్యూహాలపై ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## చంద్రబాబుకు భారీ ఊరట.. సీఐడీ పీటీ వారెంట్లను తోసిపుచ్చిన ఏసీబీ కోర్టు



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ, డిసెంబర్ 05:** టీడీపీ అధినేత చంద్రబాబుకు విజయవాడలోని ఏసీబీ కోర్టు భారీ ఊరటనిచ్చింది. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్ కేసుల్లో చంద్రబాబును విచారించేందుకు సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్లను ఏసీబీ కోర్టు తోసిపుచ్చింది. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్ లో ఉన్న సమయంలోనే సీఐడీ పీటీ వారెంట్లు దాఖలు చేసింది. ఈరోజు ఈ పిటిషన్లను విచారించిన ఏసీబీ కోర్టు.. చంద్రబాబు ప్రస్తుతం బెయిల్ పై బయట ఉన్నారని... అందువల్ల పీటీ వారెంట్లకు విచారణ అర్హత లేదని స్పష్టం చేసింది.

# స్టాక్ మార్కెట్లకు మంగళవారం కూడా లాభాలే

**ఇయ్యాల్టి న్యూస్, బిజినెస్, డిసెంబర్ 05:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం కూడా లాభాలను నమోదు చేశాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 431 పాయింట్లు లాభపడి 69,296కి చేరుకుంది. నిఫ్టీ 168 పాయింట్లు పెరిగి 20,855 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (4.46%), ఎన్టీపీసీ (3.89%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (2.31%), ఐసీఐసీఐ బ్యాంక్ (2.28%), మహీంద్రా అండ్ మహీంద్రా (1.71%). టాప్ లూజర్స్:హిందుస్థాన్ యూనిలీవర్ (-1.49%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (-1.45%), బజాజ్ ఫైనాన్స్ (-0.74%), విప్రో (-0.74%), ఇన్ఫోసిస్ (-0.73%).



## జేబుల నిండా లక్షల్లో డబ్బుంది .. అయినా ఆకలితో బిక్షగాడు మృతి..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, డిసెంబర్ 05:** అతనెవరో ఈ ప్రపంచానికి తెలియదు కాని అతని మరణం మాత్రం పోలీసులకు అనేక ప్రశ్నలను మిగిల్చింది. 50 ఏళ్ల వయస్సు ఉన్న ఓ యాచకుడి వద్ద లక్షల నగదు ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. దాదాపు రూ.1.14 లక్షల నగదు అతని వద్ద లభ్యమైంది. చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో చేరిన ఆ వృద్ధుడు.. చికిత్స ప్రారంభించిన కాసేపటికే కన్నుమూశాడు. పోస్టుమార్టం నివేదికలో 'ఆకలి' అతని చావుకు కారణమని అధికారులు తెలిపారు. అంత డబ్బు ఉన్న ఆకలితో ఎందుకు చనిపోయాడు? అతనికి ఆ డబ్బు ఎలా వచ్చింది? వంటి ఎన్నో ప్రశ్నలు పోలీసుల బుర్రలను తొలుస్తున్నాయి. వల్సాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గాంధీ లైబ్రరీ సమీపంలోని రోడ్డు పక్కన గత రెండు రోజులుగా అదే స్థలంలో బిచ్చగాడు పడి ఉండటాన్ని ఓ దుకాణం యజమాని గమనించాడు. దీంతో అతను 108కి డయల్ చేసి ఆ వృద్ధుడిని ఆసుపత్రికి తరలించాడు. వృద్ధుడికి సృహరాగానే ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ భవేష్ పటేల్ అతని వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రాథమిక పరీక్షల అనంతరం చికిత్స నిమిత్తం సివిల్ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బిచ్చగాడు చనిపోయాడు. రోజుల తరబడి ఆకలితో అలమటించడం మూలంగా వృద్ధుడు మరణించినట్లు వల్సాద్ సివిల్ హాస్పిటల్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వ్యక్తి మృతితో అతని వద్ద ఉన్న రూ.1.14 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## పెళ్లికి టెంట్ వేయలేదని... కోర్టుకెక్కిన ఘనుడు..

### కట్‌చేస్తే భారీగా జరిమానా



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, డిసెంబర్ 05:** పెళ్లికి టెంట్ వేస్తానని చెప్పి మాటతప్పినందుకు కన్జ్యూమర్ కోర్టు భారీ జరిమానా విధించింది. ఈ మేరకు ధార్వాడ్ జిల్లా కంజ్యూమర్ వివాదాల పరిష్కార కమిషన్ కర్నాటకలోని హుబ్బళ్లి ఉనకల్ సాయినగర్‌కు చెందిన ఓంకార షామియా యజమానికి జరిమానా చెల్లించాలని ఆదేశించింది. అసలేం జరిగిందంటే.. కర్ణాటకలోని ధార్వాడ్ జిల్లా బసవేశ్వర్ బ్యారేజీకి చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంక్ ఉద్యోగి ద్రైమప్ప సనక్కి అనే వ్యక్తికి ఇద్దరు సంతానం. 2021 ఏప్రిల్ 25న తన కుమారుడి పెళ్లికి షామియా వేయాలని కోరుతూ హుబ్బళ్లిలోని ఉనకల్ సాయినగర్‌కు చెందిన ఓంకార షామియానా యజమాని నింగప్పతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్ కింద రూ. 50 వేలు కూడా చెల్లించాడు.ఇంతలో కోవిడ్ వల్ల లాక్‌డౌన్ రావడంతో అంబరాయ్ గార్డెన్‌లో జరగాల్సిన పెళ్లిని తన ఇంటికి మార్చాడు. దీంతో ఈ విషయాన్ని ఓంకార షామియానా యజమాని నింగప్పకు తెలియజేశాడు. కానీ పెళ్లి జరిగిన రోజున ఇంటి వద్ద షామియానా వేయలేదు. ఎందుకు వేయలేదని షామియానా యజమాని నింగప్పను అడుగగా కోవిడ్ కారణం వేయలేకపోయానని సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ఆ తర్వాత గతేడాది సెప్టెంబర్ 28వ తేదీన తమ కుమార్తె వివాహానికి షామియానా వేయాలని నింగప్పను కోరాడు. కానీ ఈ పెళ్లికి కూడా నింగప్ప షామియానా వేయలేదు. దీంతో ద్రైమప్ప కంజ్యూమర్ కోర్టును ఆశ్రయించాడు.కేసును విచారించిన కమిషన్ చైర్మన్ ఈశప్ప భూతే, సభ్యులు విశాలాక్షి బోళశెట్టి, ప్రభు హీరేమఠ్.. రూ.50వేలు ఫీజు కింద పొందిన తర్వాత కూడా ద్రైమప్ప కుమారుడి పెళ్లికి గానీ, కూతురు పెళ్లికి గానీ షామియానా వేయకపోవడాన్ని తప్పుబట్టింది. వినియోగదారుల రక్షణ చట్టం కింద దీనిని సేవా లోపంగా పరిగణించింది. ఫిర్యాదుదారు చెల్లించిన రూ.50 వేలతోపాటు, ఫీజు చెల్లించి నాటి (2021) నుంచి వడ్డీ కలిపి నెల రోజుల్లోగా డబ్బు తిరిగిచెల్లించాలని ఓంకార షామియా యజమాని నింగప్పను కంజ్యూమర్ కోర్టు ఆదేశించింది. ఫిర్యాదుదారుడికి కలిగించిన బాధ, మానసిక హింసకు పరిహారంగా రూ. 15 వేలు, కేసు ఖర్చుల కింద రూ. 5 వేలు చెల్లించాలని కమిషన్ ఆదేశించింది.

## కొట్లాడు కుందాం.. రా..! దిమిలిలో వినూత్న జాతర..

### ఒంటి నిండా బూరద పూసుకుంటూ..



**ఇయ్యాల్టి న్యూస్, ఏపీ , డిసెంబర్ 05:** సంస్కృతి సాంప్రదాయాలకు పెట్టింది పేరు మన దేశం. విభిన్న ఆచారాలు, సాంప్రదాయాలతో పండుగలు,, ఉత్సవాలు, జాతరలు నిర్వహించడం ఆనవాయితీ..! అందులో భాగంగానే ప్రాంతాలకు తగ్గట్టుగా వారి ఆచారాలు సాంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు ఉత్సవాలు జరుగుతూ ఉంటాయి. కానీ మీకు చెప్పబోయే పండగ కాస్త భిన్నం.. అక్కడకు వెళ్లిన వారు ప్రతి ఒక్కరూ బురద పూసుకోవాల్సిందేనట..! ఎక్కడైనా ఉత్సవం జరిగినా.. జాతర మహోత్సవం నిర్వహించినా.. గ్రామ దేవతకు పూజలు చేయడం, నైవేద్యం పెట్టడం, ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ..! కానీ ఆ గ్రామంలో ఉత్సవం రోజు ఒంటినిండా బురద పూసుకుంటారు జనం. కనిపించిన వారందరినీ బురదలో దింపుతారు. మహిళలకు ఈ బురద ఉత్సవంలో మినహాయింపు. తెల్లవారుజాము నుంచే వీధుల్లోకి వచ్చి బురద పూసుకొని కేరింతల కొట్టే బురద ఉత్సవ విశేషాలు తెలుసుకుందామా మరి..?ఉమ్మడి విశాఖ జిల్లా లోని రాంబిల్లి మండలం దిమిలి గ్రామం అది. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ఉంది. ఈ గ్రామం వింత పండగలు ఉత్సవాలకు పెట్టింది పేరు. ఇక్కడ గ్రామస్తులంతా ఏ ఉత్సవమైన.. నిష్టతో నిబద్ధతతో ఐకమత్యంగా కలిసిమెలిసి చేసుకుంటారు. అయితే ఇక్కడ రెండేళ్లకోసారి.. వారం రోజుల వ్యవధిలోనే రెండు పండుగలు నిర్వహించుకోవడం విశేషం. అందులో ఒకటి వెదురు కర్రలతో కొట్టుకునే దల్లమ్మ జాతర.. మరొకటి ఒంటినిండా బురద పోసుకొనే బురదమాంబ పండగ. కోరికలు తీర్చే తల్లిగా.. బురదమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తూ ఉంటారు గ్రామస్తులు. పూర్వకాలంలో గజదొంగల దండు ఊరిపై దండెత్తి మహిళలను అపహరించే వారట. వారి నుంచి స్థానికులను కాపాడేందుకు దల్లమ్మ అనే వీర వనిత దొంగలను నిలువరించే క్రమంలో.. బురద గుంటలో పడి ప్రాణాలు కోల్పోయినట్టు కథనాలు. ఆ వీర మహిళా దల్లమ్మకు నివాళు లర్పించేందుకు ఈ వింత పండగను గ్రామస్తులు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అంటున్నారు గ్రామస్థులు సేనాపతి అప్పారావు, నాగేశ్వరరావు.బురద ఉత్సవం ముగిసిన తర్వాత గ్రామస్తులంతా అమ్మవారి ఆలయానికి చేరుకొని మహిళలు పసుపు కుంకుమలు నైవేద్యాలు సమర్పిస్తారు. మగవారు బురదతో కూడిన వేపకొమ్మలను అమ్మవారి వద్ద ఉంచుతారు. గ్రామస్తుల్లో ఎవరైనా మగవారు ఈ ఉత్సవంలో పాల్గొనకపోతే అరిష్టం జరుగుతుందని నమ్ముతారు. అందుకే ఎంతటి వారైనా ఈ బురద ఉత్సవంలో పాల్గొన్న తీరాల్సిందేనట..!

## వామ్మో.. నువ్ మనిషివేనా భయ్యా..! విపరీతమైన చలిలో చెమటలు పట్టిస్తూ..



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, డిసెంబర్ 05:** సోషల్ మీడియా పుణ్యమా అని నిత్యం అనేక రకాల వీడియోలను వైరల్ అవుతున్నాయి. ఇంటర్‌నెట్‌లో ఫేమస్ కావాలని, రాత్రికి రాత్రే పాపులారిటీ సంపాదించుకోవాలనే లక్ష్యంతో కొందరు వ్యక్తులు ఎన్నో రకాల వింత చేష్టలు చేస్తుంటారు. అవన్నీ వీడియోలు తీసుకుని ఇంటర్‌నెట్‌లో వదులుతుంటారు. సోషల్ మీడియాలో వైరల్ కావాలనే మోజుతో ఎన్ని వింతలు చేస్తారో చెప్పడానికి ఈ వీడియో నిదర్శనం, అయితే ఈ వ్యక్తి ధైర్యం అన్ని హద్దులను దాటి మంచు కొండల్లోకి ఎక్కింది.అసలే చలికాలం..ఈ సమయంలో చల్లటి నీళ్లను చేతితో తాకాలంటే కూడా ఒంట్లో వణుకు పుడుతుంది. కానీ, ఎముకలు కొరికే చలిలో కూడా మంచు కొండల మధ్య ఓ వ్యక్తి చేసిన ఫీట్లు అందరినీ షాక్ అయ్యేలా చేస్తుంది. అవును, మీరు నమ్మకపోతే ఈ వీడియో చూడండి. ఈ వీడియో చూసిన తర్వాత మీరు కూడా ఆందోళనలో పడతారు. అవును..నిజంగా అతను మనిషా? లేదా మరేదైననా అనే సందేహం వ్యక్తం చేస్తారు. ఎందుకంటే అలాంటి చల్లని వాతావరణంలో అతను కేవలం లోదుస్తులను మాత్రమే ధరించి ఉన్నాడు. అంతేకాదు, ఆ వ్యక్తి చేతిలో రెండు పెద్ద గొడ్డళ్లు పట్టుకుని ఉన్నాడు. ఎత్తైన మంచు కొండ మీదనుంచి బిగ్గరగా అరుస్తూ అతడు.. ఒక్కసారిగా కిందకు దూకేశాడు. మంచు పర్వతం క్రింద ఉన్న నీటి గుంటలో డైవ్ చేశాడు.బిల్డర్‌లా కనిపిస్తున్న ఆ వ్యక్తి ఎత్తైన మంచు పర్వతంపై నుండి దూకేస్తున్న వీడియో ట్విట్టర్‌లో వైరల్ అవుతోంది. 45 లక్షలకు పైగా నెటిజన్లు ఈ వీడియోను వీక్షించారు. దీనిపై నెటిజన్లు కూడా చాలా కామెంట్లు చేస్తున్నారు. ఈ వ్యక్తి అద్భుతమైన ఫీట్‌ని కొందరు ప్రశంసించగా, చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అతను నిజంగా మానవుడేనా అనే సందేహం అందరిలోనూ వ్యక్తమవతుంది.? కానీ ఇది చాలా ప్రమాదకరమైన పని అని మరొక వినియోగదారు రాశారు. మూడవ వినియోగదారు అతని జంప్ అద్భుతంగా ఉందని, చాలా మంది వినియోగదారులు మనిషి ధైర్యాన్ని ప్రశంసించారు. అయితే చాలా మంది అతను చలిలో ఇలా తన ప్రాణాలను పణంగా పెట్టాడని అంటున్నారు.

## గోమూత్ర రాష్ట్రాల్లోనే బీజేపీ గెలుస్తుంది: లోక్‌సభలో డీఎంకే ఎంపీ




**ఇయ్యాల్టి న్యూస్, ఢిల్లీ , డిసెంబర్ 05:** డీఎంకే ఎంపీ సెంథిల్‌కుమార్ మంగళవారం లోక్‌సభలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలు గా వర్ణించారు. జమ్మూకశ్మీర్ బిల్లులపై జరిగిన చర్చ సమయంలో ఆయన మాట్లాడుతూ.. హిందీ భాష మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలు అంటూ విమర్శించారు. ఆ రాష్ట్రాల్లోనే బీజేపీ విజయం సాధిస్తుంది, కానీ దక్షిణాది రాష్ట్రాల్లో కాషాయ పార్టీకి గెలుపు ఉండదని అన్నారు.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీజేపీ పార్టీ విజయం నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ విషయాన్ని గుర్తుచేస్తూ కేవలం ఉత్తరాదిలోనే బీజేపీ గెలుస్తుందని, అవి గోమూత్ర రాష్ట్రాలని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోకి బీజేపీ రాలేదన్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఏపీ, కర్నాటకలో.. స్థానిక పార్టీలే బలంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.ఎంపీ సెంథిల్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి ఖండించారు. సనాతన సంప్రదాయాన్ని అవమానించినట్లు ఆమె చెప్పారు. త్వరలోనే డీఎంకేకు గోమూత్ర లాభాలు ఏంటో తెలుస్తాయన్నారు. దేశ ప్రజలు ఇలాంటి ద్వేషుల్ని సహించరన్నారు. దేశ మనోభావాలతో ఆడుకోవాలనుకునే వాళ్లకు ప్రజలే బలమైన గుణపాఠం చెబుతారని ఆమె అన్నారు.

## ప్రపంచంలోనే ఎత్తైన మకావు టవర్ పై నుంచి బంగీ జంపింగ్ ..

### అంతలో ఊహించని ప్రమాదం



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, డిసెంబర్ 05:** చైనాలో ఉన్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన బంగీ జంప్ ప్లాట్‌ఫారమ్ నుంచి కిందకి దూకిన జపాన్ టూరిస్ట్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మకావు టవర్‌పై నుంచి కిందకు దూకిన పర్యాటకుడు నేలపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆ తర్వాత కొద్ది సమయానికే మరణించాడు. ఆదివారం మకావు మునిసిపాలిటీలో ఉన్న 764 అడుగుల మకావు టవర్‌పై నుంచి అతను కిందకు దూకాడు. దీంతో అతన్ని అత్యవసర చికిత్స కోసం కొండే ఎస్. జనువారియో ఆసుపత్రికి తరలించారు. కానీ అక్కడ చికిత్స ప్రారంభించిన కొద్ది సమయానికే మరణించాడు. దీనిపై అక్కడి పోలీసులు విచారణ ప్రారంభించారు.బంగీ జంప్ అధికారిక వెబ్‌సైట్‌లో కస్టమర్‌లు సందర్శనకు వచ్చే ముందు కొన్ని సూచనలు చేస్తుంది. ఇందులో పాల్గొనే కస్టమర్లకు ఏవైనా వైద్యపరమైన సమస్యలు ఉంటే తమకు తెలియజేయమని కస్టమర్‌లకు కోరుతుంది. ముఖ్యంగా గుండె సమస్యలు, రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలున్న వారికి ముందస్తు జాగ్రత్తలు సూచిస్తుంది. అక్కడ బంగీ జంప్‌ను %హాజీ% హ్యాకెట్ సంస్థ నిర్వహిస్తుంది. ఇక్కడి స్కైపార్క్‌లో ఒక రౌండ్ ధర సుమారు రూ.25,000. ఈ కంపెనీ ఆస్ట్రేలియా, సింగపూర్, ఫ్రాన్స్‌లలో కూడా బంగీ జంప్‌లను నిర్వహిస్తుంది. ఈ కంపెనీ 30 సంవత్సరాలలో నాలుగు మిలియన్ జంప్‌లను విజయవంతంగా పూర్తి చేసినట్లు తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. పర్ఫెక్ట్ సేఫ్టీ రికార్డులో ఎప్పుడూ అంచనాలు తప్పింది లేదు.చైనాలో ఉన్న మకావు టవర్ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్లాట్‌ఫారమ్. 2019 లో పోలాండ్‌లో 330 అడుగుల బంగీ జంప్ సమయంలో 39 ఏళ్ల వ్యక్తి తన తాడు తెగిపోవడంతో నేలపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని వెన్నెముకకు గాయాలయ్యాయి. గ్డినియాలోని ఓ థీమ్ పార్క్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజ్ అప్పట్లో వైరల్ అయ్యింది. అతను ప్లాట్‌ఫారమ్ నుంచి దూకిన తర్వాత అతని బంగీ తాడు తెగిపోయి నేలపై పడిపోయాడు.

## మిత్రపక్షాల్లో అసహనం.. ఇండియా కూటమి సమావేశం రద్దు.. కారణం అదేనా..?




**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, డిసెంబర్ 05:** ఇండియా కూటమి భేటీ నేడు బుధవారం ఉంటుందని ముందుగా ప్రకటించారు. ఈ క్రమంలో దాన్ని రద్దు చేస్తూ కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో జరగాల్సిన ఇండియా కూటమి సమావేశం రద్దయినట్లు కాంగ్రెస్ తెలిపింది. ఈనెల మూడోవారంలో సమావేశం జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశానికి హాజరుకావడం లేదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ , సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో కూటమిలోని పార్టీల మధ్య విభేదాలు మళ్లీ రచ్చకెక్కాయి. కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందన్న భావన ఇండియా కూటమి నేతల్లో నెలకొంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసిందని , మిత్రపక్షాలను పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా సమాజ్‌వాదీ పార్టీ, జేడీయూ వేర్వేరుగా మధ్యప్రదేశ్‌లో పోటీ చేశాయి. విపక్షాల ఓట్లు చీలడంతోనే మూడు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని మమతా బెనర్జీ పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ వైఖరే కారణమని మండిపడ్డారు.అంతేకాకుండా.. కాంగ్రెస్ కలుపుకునిపోకపోవడం వల్ల ఇలాంటి ఫలితాలు వచ్చాయన్న విమర్శలు సైతం కూటమిలోని నేతల నుంచి వినిపిస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ గెలిచినా, ఇండియా కూటమి ఓట్లు చీలడం వల్ల మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అభిప్రాయపడ్డారు. సీట్ల సర్దుబాటు ఉండాలని తాము చెప్పామని కానీ కాంగ్రెస్ పట్టించుకోలేదన్నారు. ఎన్నికల్లో గెలవాలంటే సైద్ధాంతిక బలంతోపాటు, వ్యూహం కూడా అవసమని అభిప్రాయపడ్డారు. 2024 ఎన్నికల్లో గెలవాలంటే, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటే, బీజేపీ అధికారంలోకి రాదన్నారు.

## మిచౌంగ్ బీభత్సం.. తమిళనాడు అతలాకుతలం.. ఆ జిల్లాల్లో కుండపోత వానలు..



**ఇయ్యాల్టి న్యూస్, వెదర్ , డిసెంబర్ 05:** మిచౌంగ్ తుపాను తమిళనాడులో బీభత్సం సృష్టించింది. భారీ వర్షం కారణంగా చెన్నై నగరం అతలాకుతలమైంది. అనేక ప్రాంతాలు నీట మునగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నైలో భారీ వర్షాల కారణంగా ఇప్పటి వరకూ ఎనిమిది మంది మరణించారు. విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మరణించగా, నగరంలోని అప్‌మార్కెట్, బీసెంట్ నగర్ ప్రాంతంలో చెట్లు కూలడంతో ఒకరు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. చెన్నై జిల్లాలోని పెరుంగుడిలో 45 సెంటీమీటర్ల వర్షం పడగా.. తిరువళ్లూరు జిల్లా పూనమల్లి 34 సెంటీమీటర్లు, ఆవడిలో 28 సెంటీమీటర్ల వర్షం కురిసింది. చెన్నైలో పలు ప్రాంతాల్లో భారీ వరద కారణంగా కార్లు కొట్టుకుపోయాయి.చెన్నైలోని అనేక ప్రాంతాలు మోకాళ్ల లోతు నీటిలో మునిగిపోయాయి. నిన్న ఉదయం నుండి నగరంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తుపాన్ కారణంగా నిన్న చెన్నై ఎయిర్‌పోర్టును మూసివేశారు. అయితే ఈ రోజు వర్షాలు కాస్త తగ్గడంతో మళ్లీ సర్వీసులను మొదలుపెట్టేందుకు సిద్ధమయ్యారు. తమిళనాడు సీఎం స్టాలిన్.. రాష్ట్రంలోని తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. చెన్నైలోని కన్నపర్ తితల్‌లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాన్ని సందర్శించారు. భారీ వర్షాల వల్ల సంభవించిన నష్టం, తుపాను అనంతర పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.తమిళనాడులోని పది జిల్లాల్లో ఈ రోజు ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ కేంద్రం తెలిపింది. చెన్నై, తిరువళ్లూరు, చెంగల్‌పట్టు, కాంచీపురం, రాణిపేట, వేలూరు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.


## ఇజ్రాయెల్ భారీ స్కెచ్.. హమాస్‌కు చెక్ పెట్టేందుకు నీళ్లను ఆయుధంగా మార్చబోతుందా ?



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, డిసెంబర్ 05:** గాజా స్ట్రిప్‌పై పూర్తిస్థాయిలో ఇజ్రాయెల్ సైన్యం పట్టుబిగించింది. హమాస్‌కు చెందిన కీలక స్థావరాలను ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో హమాస్ సొరంగాలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సొరంగాలు ఇజ్రాయెల్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి. ఈ క్రమంలో వాటిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా సొరంగాలను సముద్రపు నీటితో నింపేందుకు రంగం సిద్ధం చేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించింది.నవంబర్ మధ్యలోనే ఇజ్రాయెల్ సైన్యం అల్ షాతి శరణార్థి శిబిరానికి ఉత్తరాన ఓ మైలు దూరంలో ఐదు పంపులను ఏర్పాటు చేసిందని పేర్కొంది. ఇవి గంటకు వేల క్యూబిక్ మీటర్ల నీటిని పంప్ చేస్తాయని, వారాల్లోనే సొరంగాలను నీటితో ముంచేస్తాయని అమెరికా అధికారులను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. బందీలను విడుదల చేసుకునేందుకు పంపులను వినియోగించాలని చూస్తుందా? అనేది స్పష్టంగా తెలియరాలేదు. అయితే, గతంలో బందీలను సొరంగాల్లో సురక్షితంగా ఉంచినట్లు గతంలో పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, గాజా స్ట్రిప్‌లో హమాస్ నిర్మించిన విస్తారమైన నెట్‌వర్క్‌ను దెబ్బతీసేందుకు నీటితో నింపాలనే ఇజ్రాయెల్ భారీ పంపులను సమీకరించినట్లు భావిస్తున్నారు.సొరంగాలను నాశనం చేయడం ద్వారా హమాస్ యోధులను భూగర్భాల్లో దాక్కున్న సొరంగాల నుంచి బయటకు రప్పించేందుకు నీటిని నింపాలని పథకం వేసినట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంపై యూఎస్ అధికారులను సంప్రదించగా.. సొరంగాలను పనికిరాకుండా చేయడమే దీనికి అర్థమని.. ఇందుకు ఇజ్రాయెల్ అనేక మార్గాలను అన్వేషిస్తుందని ఓ అధికారి పేర్కొన్నారు. దీనిపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రిత్వ శాఖ స్పందించలేదు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనంపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ అధికారి సైతం స్పందించేందుకు నిరాకరించారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.com/

# 'దేవర' కోసం భారీ సెట్ .. ఈ ఫైటింగ్ ఇంటర్వెల్ బ్యాంగ్?



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05:** కొరటాల – ఎన్టీఆర్ కాంబినేషన్లో 'దేవర' సినిమా రూపొందుతోంది. ఎన్టీఆర్ ఆర్ట్స్ – యువ సుధా ఆర్ట్స్ బ్యానర్లో ఈ సినిమా నిర్మితమవుతోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకి అనిరుధ్ సంగీతాన్ని సమకూర్చుతున్నాడు. ఈ సినిమాతోనే జాన్వీ కపూర్ టాలీవుడ్ కి పరిచయమవుతోంది.ప్రస్తుతం ఈ సినిమా .. షూటింగు దశలో ఉంది. తదుపరి షెడ్యూల్ ను హైదరాబాదులోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్లాన్ చేసినట్టు సమాచారం. అక్కడ ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్ ను చిత్రీకరించనున్నారని అంటున్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఒక సెట్ వేయించినట్టు చెబుతున్నారు.ఈ సెట్లో చిత్రీకరించే యాక్షన్ సీన్ .. ఇంటర్వెల్ బ్యాంగ్ గా వస్తుందని అంటున్నారు. సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాలో, ప్రకాశ్ రాజ్ .. శ్రీకాంత్ .. మురళీశర్మ ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5వ తేదీన ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు.

**చూసి ముర్వాలే**



# బాలయ్య కోసం కథపై కసరత్తు చేస్తోన్న బోయపాటి

## అఖండ2కి ముహూర్తం ఎప్పుడంటే..?



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05:** బాలకృష్ణ – బోయపాటి కాంబినేషన్లో సినిమా అంటే ఫ్యాన్స్ కు పూనకాలు వచ్చేస్తాయి. గతంలోవీరి కాంబోలో వచ్చిన మూడు సినిమాలు బ్లాక్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. ఇద్దరు కలిసి హ్యాట్రిక్ హిట్ కొట్టారు. వీరి కాంబోలో వచ్చిన 'అఖండ సినిమా రీసెంట్ గా రెండేళ్లు కప్లీట్ చేసుకుంది. బాలకృష్ణ కెరియర్లోనే అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాగా నిలిచింది. మాస్ యాక్షన్ ను లింక్ చేస్తూ ఫ్యామిలీ డ్రామాను నడిపించడంలో బోయపాటికి మంచి పేరు ఉంది. వాటికి తోడు ఈ కథలో దైవశక్తిని కూడా యాడ్ చేయడం మరింతగా కలిసొచ్చింది. ఇక ఈసినిమాకు సీక్వెల్ ఉంటుంది అని బోయపాటి అప్పుడెప్పుడో ప్రకటించారు. కాని ఇప్పటి వరకూ ఆ సినిమాపై ఎటువంటి అప్ డేట్ ఇవ్వలేదు. అఖండ తరువాత బోయపాటి చేసిన 'స్కంద' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. దాంతో మళ్లీ బాలయ్యతోనే సినిమా చేసి హిట్ కొట్టాలి అని అనుకుంటున్నాడు. అందుకే బోయపాటి ప్రస్తుతం 'అఖండ 2'కి సంబంధించిన కథను రెడీ చేసుకుంటున్నాడని అంటున్నారు. 'కథపై కసరత్తులు చేస్తున్నాడట బోయపాటి. అఖండ'లోని పాయింటును పట్టుకునే సీక్వెల్ కూడా ముందుకు వెళుతుంది. ఈ విషయాన్ని గతంలోనే బోయపాటి చెప్పాడు. ఇక ప్రస్తుతం బాలయ్య .. బాబీ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. ఈ సినిమా తరువాతనే ఆయన బోయపాటి ప్రాజెక్టుపైకి వెళ్లవలసి ఉంటుంది. అయితే ఈమధ్యలో బోయపాటి అల్లు అర్జున్ తో సిన్మి చేయాల్సి ఉంది. కాని బన్నీ పుష్ప 2 హడావిడి అయ్యేదాకా ఇంకే సినిమా వైపు చూడడు. పుష్ప తరువాత బోయపాటితో చేస్తాడా లేక హిట్ ఫామ్ లో ఉన్న సందీప్ రెడ్డితో అల్లు అర్జున్ సినిమ చేస్తాడా అనేది తేలాల్సి ఉంది. అయితే ఈలోపు బోయపాటి.. 'అఖండ 2' కథ రెడీ చేసి పెట్టుకుంటే..బన్ని టైమ్ ఇవ్వకున్నా.. బాలయ్యతో అనుకున్న సమయానికి సినిమా మొదలెట్టవచ్చుక అని చూస్తున్నాడు. మరి బోయపాటి అఖండ 2తో హిట్ ఇస్తాడా..? అసలు ఈసినిమా షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ అవుతుంది. త్వరలో అప్ డేట్ ఇవ్వాలని ప్లాన్ లో ఉన్నారట బోయపాటి టీమ్. మరి ఇస్తారా ఇవ్వరా అనేది చూడాలి.

# సిల్క్ స్మిత బయోపిక్ హీరోయిన్ అందాలు అదుర్స్...

## మళ్లీ బావలు సై సై అనాల్సిందే...!



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05:** హాట్ బ్యూటీ చంద్రికా రవి.. ఇటీవల కాలంలో బాగా ట్రెండింగ్ గా మారింది. దానికి కారణం ఈమె సిల్క్ స్మిత బయోపిక్ లో నటిస్తుండటమే.సిల్క్ స్మిత.. 90స్ కాలంలో కుర్రాళ్లను ఓ ఊపు ఊపేసింది ఈ భామ. ఇక ఆమె చేసిన సినిమాలు, పాత్రలు గుర్తుకు వస్తే వారి పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సిల్క్ స్మిత జయంతి. 63వ పుట్టిన రోజు సందర్భంగా ఆమె బయోపిక్ ను తీసుకు రాబోతున్నట్లు చిత్రబృందం ఇటీవల ప్రకటించింది.ఈ సినిమాకు జయరాం దర్శకత్వం వహిస్తుండగా... వి మహాస్త్రి అమృత రాజ్ సమర్పణలో స్త్రీ సినిమాని నిర్మిస్తున్నారు. ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది.ఎస్ బి విజయ్ ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ గా వ్యవహరించబోతున్నారు. అయితే తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రాన్ని తీసుకు రాబోతున్నట్లు కూడా వెల్లడించారు.అచ్చం ఆమెలాగే కనిపిస్తున్న ఈ హాట్ బ్యూటీ మరెవరో కాదు చంద్రికా రవి. భారత సంతతికి చెందిన ఈ ముద్దుగుమ్మ ఆస్ట్రేలియన్ హీరోయిన్.మోడల్ గా, హీరోయిన్ గా అద్భుతమైన చిత్రాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా చీకటి గదిలో చితక్కొట్టుడు చిత్రంలో కనిపించిన ఈమె సిల్క్ స్మిత పాత్రలో మెరవబోతుంది.ఈ హాట్ బ్యూటీయే ఇప్పుడు సిల్క్ స్మితగా కనిపించి అందరినీ మెస్మరైజ్ చేసేందుకు రాబోతుంది. అయితే ఇప్పటికే ద డర్టీ పిక్చర్ సినిమా పేరిట సిల్క్ స్మిత జీవితాన్ని పూర్తిగా చూపించేశారు. అయితే అప్పుడు సిల్క్ స్మిత పాత్రలో విద్యా బాలన్ నటించగా.. విపరీతమైన స్పందన వచ్చింది.అచ్చం ఆమెలాగే విద్యా బాలన్ కనిపించడం, ఆమె జీవితం మొత్తం చూపించడంతో అంతా ఫిదా అయిపోయారు.మరి మరోసారి రాబోతున్న సిల్క్ స్మిత బయోపిక్ ఏ రేంజ్ లో ఆకట్టుకుంటుందో... ముఖ్యంగా చంద్రికా రవి ఏ మేర ప్రేక్షకులను అలరిస్తుందో చూడాలి.

# 'బలగం' వేణు డైరెక్షన్ లో చేయాలనుంది: హీరో నాని




**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05:** నాని హీరోగా ఈ నెల 7వ తేదీన ప్రేక్షకుల ముందుకు రావడానికి 'హాయ్ నాన్న' సినిమా సిద్ధమవుతోంది. దాంతో ఈ సినిమా ప్రమోషన్స్ లో నాని ఫుల్ బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను జనంలోకి తీసుకుని వెళ్లడానికి తనవంతు కృషి చేస్తున్నాడు. అందులో భాగంగానే కొంతసేపటి క్రితం నాని ట్విట్టర్ ద్వారా 'ఆస్క్ నాని' పేరుతో చాట్ సెషన్ నిర్వహించారు.ఈ చాట్ సెషన్ లో ఆయన అభిమానులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానాలిస్తూ వెళ్లాడు. కొత్తగా వచ్చిన దర్శకులలో ఎవరితో సినిమా చేయడానికి మీరు ఎక్కువ ఆసక్తిని చూపుతున్నారు? అంటూ ఒక అభిమాని అడిగాడు. అందుకు నాని స్పందిస్తూ, 'బలగం' వేణు పేరు చెప్పాడు. ఆ సమాధానం పట్ల మిగతా అభిమానులు కూడా హర్షాన్ని వ్యక్తం చేశారు. కథ బాగుండాలే గానీ కొత్త దర్శకులకు అవకాశాలు ఇవ్వడంలో నాని ఎంత మాత్రం ఆలోచన చేయడు. అవకాశం కుదిరినప్పుడల్లా ఆయన కొత్త దర్శకులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూనే వెళుతున్నాడు. 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ కి కూడా ఇదే ఫస్టు మూవీ. తాజాగా నాని చెప్పిన ఈ మాట వింటుంటే, ఇక 'బలగం' వేణుదే ఆలస్యం అనిపిస్తోంది.

# పెదవులు కొరుకుతూ .. వేళ్ళతో నిమురుతూ... ఫరియా అరాచకం...



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05:** జాతి రత్నాలు ఫేమ్ ఫరియా అబ్దులా బోల్డ్నెస్ తో బౌండరీలు బ్రేక్ చేసింది. పెదవులు మునిపంటితో కొరుకుతూ కుర్రాళ్ళ గుండెల్లో సెగలు రేపింది. ఫరియా హాట్ లుక్ వైరల్ అవుతుంది. ఫరియా ప్రొఫెషనల్ డాన్సర్. మంచి యాక్టింగ్ స్కిల్స్ కూడా ఉన్నాయి. బ్రేక్ మాత్రం రావడం లేదు. కనీసం టైర్ టూ హీరోలు కూడా తమ చిత్రాల్లో తీసుకోవడం లేదు. ఫరియా హైదరాబాద్ కి చెందిన అమ్మాయి కావడం మరో విశేషం. ఆమె కెరీర్ ఒడిదుడుకులతో సాగుతుంది. ఫరియాకు దర్శకుడు అనుదీప్ హీరోయిన్ ఛాన్స్ ఇచ్చాడు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన జాతిరత్నాలు చిత్రంతో ఫరియా సిల్వర్ స్క్రీన్ కి పరిచయమైంది. నవీన్ పోలిశెట్టి, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రలు చేయగా ఫరియా హీరోయిన్ రోల్ చేశారు.జాతిరత్నాలు భారీ విజయం సాధించింది. ఈ కామెడీ ఎంటర్టైనర్ కాసులు కురిపించింది. చిట్టి పాత్రలో ఫరియా ఒదిగిపోయి నటించింది. ఇన్నోసెంట్ లాయర్ గా, లవర్ గా నవ్వులు పూయించింది. జాతిరత్నాలు ఫరియాను ఓవర్ నైట్ స్టార్ చేసిందని చెప్పొచ్చు. అయితే ఆ మూవీ విజయం సాధించిన స్థాయిలో ఆఫర్స్ అయితే రావడం లేదు. అయితే కెరీర్ సంగతి ఎలా ఉన్నా... సోషల్ మీడియా వేదికగా తన పాపులారిటీ పెంచుకునే ప్రయత్నం చేస్తుంది. ఇంస్టాగ్రామ్ లో వీడియోలు, ఫోటోలు పోస్ట్ చేస్తున్నారు. ఫరియా డాన్స్ వీడియోలకు భలే డిమాండ్ ఉంది. అలాగే బోల్డ్ ఫోటో షూట్స్ కి వెనుకాడటం లేదు.

# యా స్టయిలీష్ లుక్‌లో రష్మిక కిర్రాక్ లుక్.. యానిమల్ దెబ్బకి నేషనల్ ట్రెండింగ్..



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05:** ఇప్పటికే నేషనల్ క్రష్‌గా రాణిస్తున్న రష్మిక మందన్నా.. ఇప్పుడు మరింతగా క్రేజీగా మారింది. %--%యానిమల్%--% ఎఫెక్ట్ తో దేశ వ్యాప్తంగా ట్రెండింగ్‌గా మారుతుంది. దీనికితోడు ఫ్యాషన్ ఐకాన్‌గా మారి ఆకట్టుకుంటుంది. రష్మిక మందన్నా ప్రస్తుతం పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. లైట్ బ్లూ కలర్ డ్రెస్ ధరించింది. స్టయిలీష్ డ్రెస్‌లో కిర్రాక్ పోజులిచ్చింది. డిఫరెంట్ బ్యాక్ డ్రాప్‌లో ఆమె బార్బీ డాల్‌లా మెరిసిపోతుంది. ఈ నయా రష్మిక ఫోటోలు ఫ్యాన్స్ ని మైండ్ బ్లాక్ చేస్తున్నాయి.

# వర్కౌట్ చేస్తూ మెంటల్ ఎక్కిస్తున్న దివి..

## జీరో సైజ్ నడుముతో 'బిగ్ బాస్' భామ టెంప్టింగ్ ఫోజులు .!



**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05:** కుర్రభామ దివి వాద్య ఇటీవల తన వర్కౌట్ సెషన్ కు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో నట్టింట దుమారం రేపుతోంది. మతులు పోయేలా ఫొటోలకు స్టిల్స్ ఇస్తోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ వర్కౌట్ ఫొటోస్ చూస్తే మతిపోవాల్సిందే. తన దిన చర్యలో భాగంగా దివి వాద్య తాజాగా వర్కౌట్ సెషన్ లో పాల్గొంది. ఈ సందర్భంగా హెవీ వర్కౌట్ చేస్తూ కనిపించింది. స్లిమ్ ఫిట్ అందాల కోసం తన చేస్తున్న కృషిని వీడియో ద్వారా చూపించింది. ఈ సందర్భంగా టైట్ జిమ్ వేర్ లో దివి దర్శనమిచ్చింది. ఒంట్లో ఉన్న ఫ్యాట్ ను కరిగించేస్తూ వర్కౌట్ చేస్తూ కనిపించింది. స్లిమ్ ఫిట్ అందాలకు రహస్యం ఇదేనంటూ వీడియోతో జవాబు ఇచ్చింది. దివి మొదటి నుంచి తన ఫిట్ నెస్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటుంది. ఎప్పుడు ఫిట్ గా యాక్టివ్ గా కనిపించేందుకు ప్రయత్నిస్తుంటుంది. ఈ సందర్భంగా ఎప్పుడూ వర్కౌట్ చేస్తుంటుంది.తాజాగా టైట్ ఫిట్ లో వర్కౌట్ చేస్తూ తన స్లిమ్ ఫిట్ అందాలతో మెస్మరైజ్ చేసింది. ఫిట్ గా ఉండేందుకు వర్క్ అవుట్ చేయాల్సిందే అంటూ ఇతరులకూ స్ఫూర్తిగా నిలిచింది.

# మరీ చిన్న బ్లౌజ్ లో 'అఖండ' బ్యూటీ అందాల జాతర..
# లెహంగాలో మైమరిపిస్తున్న ప్రగ్యా జైశ్వాల్



ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, డిసెంబర్ 05: యంగ్ అండ్ గ్లామర్ బ్యూటీ ప్రగ్యా జైశ్వాల్ ప్రస్తుతం సినిమాల జోరు చూపించడం లేదు. 'అఖండ' తర్వాత ఈ ముద్దుగుమ్మ పెద్ద చిత్రాల్లో ఆఫర్స్ పెద్దగా లేవనే చెప్పాలి. దీంతో అభిమానులు నెక్స్ట్ అప్డేట్ ఎప్పుడంటూ ఎదురుచూస్తున్నారు. సినిమా అప్డేట్స్ ఇవ్వడంలో ప్రగ్యా జైశ్వాల్ కాస్తా వెనకబడే ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం కాస్తా చురుకుగానే వ్యవరిస్తోంది. తన వ్యక్తిగత విషయాలపై వరుసగా అప్డేట్స్ అందిస్తూనే వస్తోంది. ఈ క్రమంలో ఫొటోషూట్లతోనూ అదరగొడుతోంది. మరోవైపు ఈ ముద్దుగుమ్మ పలు బ్రాండ్స్ ను ప్రమోట్ చేస్తూ క్రేజీగా ఫొటోషూట్లు చేస్తోంది. అదిరిపోయే అవుట్ ఫిట్లలో ఫొటోలకు ఫోజులిస్తూ ఫ్యాన్స్ తో పాటు నెటిజన్లనూ తనవైపు తిప్పుకుంటోంది. మరింతగా ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలో తాజాగా ప్రగ్యా జైశ్వాల్ ఓ బ్రాండ్ కోసం ప్రమోషనల్ ఫొటోషూట్ చేసింది. లెహంగా, మ్యాచింగ్ బ్లౌజ్ లో స్టన్నింగ్ గా ఫొటోలకు ఫోజులిచ్చింది. మెరిసిపోయే చర్మ సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ ఆకర్షించింది. లెహంగాలో మెరిసిన బాలయ్య బ్యూటీ టాప్ గ్లామర్ తో అట్రాక్ట్ చేసింది. మరోవైపు మత్తుగా ఫోజులిస్తూ మంత్రముగ్ధులను చేసింది. గుచ్చే చూపులతో కుర్ర హృదయాలకు గాయం చేసింది. దీంతో నెటిజన్లు ఆమె ఫొటోలను నెట్టింట వైరల్ చేస్తున్నారు.

Published by: Rathnasri Latha on Behale of RRR Media Patel Nagar chowrasta.. Amberpet.. Hyderabad.. Telangana. 500013 cell: 888643 1510, 9949 152838